క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కారం


బోరు వేస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిధులు మంజూరు చేశారు. మండలంలోని కొత్త కొత్తూరు గ్రామంలో పర్యటన సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డికి మాజీ సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ, మాజీ ఎంపీటీసీ వెన్నపూసల సీతారాములు తాగునీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన మంత్రి రూ.3.60 లక్షలను మంజూరు చేశారు. ఈ మేరకు స్థానిక నాయకులు పనులు యుద్ధ ప్రాతిపదికన మంచినీటి బోరు ను ఏర్పాటు చేయటంతో పాటు, పైపులైన్ పనులు పూర్తి చేశారు. రెండు రోజుల్లో తాగునీటి సరఫరా జరుగుతుందని రాధాకృష్ణ తెలిపారు.

గంగమ్మ దేవాలయానికి ట్యాంకు నిర్మాణం..

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన ఆర్మీ జవాను జక్కుల అప్పారావు దంపతులు సుమారు రూ.65 వేలతో గంగమ్మ దేవాలయం వద్ద ఆదివారం తాగునీటి ట్యాంకు నిర్మించారు. తాను పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశ్యంతో తన తండ్రి జక్కుల పెద్దమాన్‌సింగ్ జ్ఞాపకార్థం తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టానన్నారు.

లెనిన్ స్మరణ గీతం ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: మార్క్సిస్టు మహోపాధ్యాయుడు, లెనిన్ స్మరణలో కవి, రచయిత జీవన్ రచించిన గీతాన్ని ఆదివారం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యూ ఇరా విద్యా సంస్థల అధినేత సీఈవో ఐవీ రమణారావు ఆవిష్కరించారు. జీవన్ రచించిన గీతాన్ని మేడగాని శేషగిరి రావు గానం చేయగా, మాస్టర్ అభిజ్ఞ సంగీతాన్ని సమకూర్చారు. నాయకులు నున్నా నాగేశ్వరరావు, రవిమారుత్, జితేందర్ రెడ్డి, సింగు నర్సింహారావు, వాగ్గేయకారుడు మేడగాని శేషగిరి రావు, తదితరులు ఉన్నారు.

సహకార సంఘం బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న చైర్మన్ హేమంతరావు

నేలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బలోపేతానికి పాలకవర్గం కృషి చేస్తుందని మోటాపురం సొసైటీ చైర్మన్ భాగం హేమంతరావు అన్నారు. మండలంలోని మోటాపురం సొసైటీలో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమమే పాలకవర్గం లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో సొసైటీ సీఈఓ రంగారావు, డైరెక్టర్లు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	మనమే
వినోద	హరోంహర
సాయిరాం	ఇంద్రాని
ఆదిత్య	రాజధాని రౌడీ
శ్రీనివాస	మహారాజ
సుందర్	లవ్‌మౌళి

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)		
టమాట	60	బచ్చలికూర	4	20
వంకాయ	24			
బెండకాయ	30	పాలకూర	3	20
పచ్చిమిర్చి	80			
కాకర	74	చుక్కకూర	3	20
బీర	80			
దొండ	40	తోటకూర	4	20
పొట్లకాయ	40			
గోరుచిక్కుడు	60	గోంగూర	4	20
క్యాబేజీ	30			
క్యాలీఫ్లవర్	26	మెంతికూర	3	20
ఆలుగడ్డ	34			
చామగడ్డ	44	కొత్తిమీర	1	50
క్యారెట్	50	పుదీన	1	30
క్యాప్సికం	80			

-ఖమ్మం వ్యవసాయం

ధరణితో అవస్థలెన్నో..



రిజిస్ట్రేషన్ల కోసం రైతులకు తప్పని తిప్పలు

- ఆన్‌లైన్ సేవలకు ఆపసోపాలు
- రికార్డుల నమోదులో అన్నీ తప్పుల తడకలే
- అమలులో జాప్యంపై సర్వత్రా అసహనం
- తప్పులపై మంత్రి పొంగులేటి ఆగ్రహం

ఖమ్మంరూరల్: భూ క్రయవిక్రయాలకు సంబంధించిన లావాదేవీలను సులభతరం చేసేందుకు తహసీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు అమలు చేసేందుకు గత ప్రభుత్వం ధరణి వైబ్‌సైట్‌కి శ్రీకారం చుట్టింది. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా అమలులో జాప్యం కావడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు వెళ్లలేక, అక్కడికి వెళ్లినా దళారులు, ఏజెంట్ల బెడదతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బెడదను తొలగించి రైతులకు ఆన్‌లైన్ సేవల ద్వారా పారదర్శకంగా భూక్రయ విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను నేరుగా తహసీల్దారే చేసే విధంగా ఈ విధానాన్ని అమలు చేయాలని గతంలోని ప్రభుత్వం నిర్ణయించి అమలుచేస్తోంది. అయితే పక్కాగా అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

ధరణి ప్రయోజనాలు ఇలా..

నకిలీ రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఉండదు. తహసీల్దార్ భూముల రికార్డుల ప్రక్రియలో వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడంతో వారికి అవగాహన ఉంటుంది. ఆన్‌లైన్‌లో భూముల వివరాలు చూసి రిజిస్ట్రేషన్ కాగానే మొదటి మ్యుటేషన్ చేయడంతో పహణీలో నమోదు చేసుకునేందుకు కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అగత్యం తప్పుతుంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దళారుల బెడద ఉండటంతో తప్పుడు రిజిస్ట్రేషన్లకు అవకాశం ఉంటుంది అని అధికారులు చెబుతున్నా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

అన్నీ తప్పుల తడకలే..

రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఆలస్యంగా అవుతోంది. భూ రికార్డుల్లో గతంలో అనేక తప్పులు దొర్లినా.. వాటిని సరిచేయడంలో ధరణి వైబ్‌సైట్‌లో ఉన్న వివరాలకు క్షేత్రస్థాయిలో ఉన్న భూములకు ఎలాంటి పొంతన లేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ఉదాహరణకు ఒకరి పేరుమీద రెండున్నర ఎకరాలు భూమి ఉంటే అందులో కేవలం ఎకరంన్నర మాత్రమే పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదైంది. సదరు రైతు మిగతా ఎకరం భూమి క్షేత్రస్థాయిలో ఉన్నప్పటికీ అది అతడి పేరున రావడంలేదు. దీంతో ఆ ఎకరం భూమి తన పేరు మీద రికార్డుల్లో నమోదు చేయాలని రెవెన్యూ కార్యాలయాల సంవత్సరాల తరబడి తిరుగుతున్నా.. పని మాత్రం కావడంలేదు. ఇలా మండలంలో చాలా మంది రైతులు రికార్డుల్లో నమోదు కాకపోవడంతో ఆ భూమిని అమ్ముకోవాలన్నా అమ్ముకునే పరిస్థితి లేదు. అదే విధంగా ప్రభుత్వం నుంచి రావాల్సిన రైతుబంధు సొమ్ము కూడా రాక నానా అవస్థలు పడుతున్నారు. అదే విధంగా భూమి తక్కువగా రికార్డుల్లో ఉండడంతో బ్యాంక్ రుణం కూడా తక్కువగా వస్తోంది. అధికారులు తప్పులను సరిచేసి భూ రికార్డులను సవ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాలుగేళ్లుగా తిరుగుతున్నా..



నాకు ఉన్న 4.10 ఎకరాల్లో 3.30 ఎకరాలు మాత్రమే పాస్ పుస్తకంలో నమోదయింది. క్షేత్రస్థాయిలో భూమి ఉండి సాగుచేసుకుంటున్నా. కానీ పాస్‌బుక్‌లో లేకపోవడంతో ఇటు రైతుబంధు రావడంలేదు. బ్యాంక్‌లో రుణం తక్కువగా వస్తోంది. అదీగాక భవిష్యత్‌లో భూమిని ఏదైనా చేద్దామంటే చేయలేని పరిస్థితి. నాలుగు సంవత్సరాల నుండి పాస్‌బుక్‌లో నమోదు చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పని కావడంలేదు. క్షేత్రస్థాయిలో సర్వే చేసి తన 20గుంటల భూమిని భూ రికార్డుల్లో నమోదు చేయాలి.

– సీహెచ్. వీరయ్య, రైతు, పోచారం

తప్పలపై మంత్రి పొంగులేటి ఆగ్రహం..

ఇదిలా ఉండగా భూ రికార్డులు తప్పుల తడకగా ఉన్న విషయంపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులపై ఒకింత ఆగ్రహం, అసహనం వ్యక్తం చేశారు. ఈ నెలలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజల చెంతకే మీ శ్రీనన్న కార్యక్రమాల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ధరణి గురించి భూముల రికార్డులు తప్పుగా నమోదు కావడంతో రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి గతంలో ఏ జరిగిందో ఏమో ఇప్పటి నుంచి గ్రామాల్లో భూ సమస్యలపై వివాదాలు రావొద్దని, తక్షణమే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి రికార్డులను యుద్ధప్రాతిపదికన సరిచేయాలని అధికారులను ఆదేశించారు.

భూ రికార్డుల పరిష్కారం ఇకపై వేగిరం..

ధరణిలో భూరికార్డులకు సంబంధించి గతంలో కేవలం కలెక్టర్‌కు మాత్రమే లాగిన్ అయ్యే అవకాశం ఉండేది. దీంతో ఒక్కరే చూడడం వల్ల కొంత ఆలస్యం అయ్యేది. ఇప్పుడు అలా కాకుండా భూమి విలువను బట్టి తహసీల్దార్, ఆర్‌డీఓ, జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌లు లాగిన్ అయ్యే విధంగా ప్రభుత్వం నిబంధనలు మార్చింది. దీంతో భూ సమస్యల పరిష్కారం ఇక నుండి వేగవంతం అవుతుంది. సంబంధిత రైతులు ఏసర్వే నంబర్‌లో ఎంత భూమి మిస్ అయ్యిందో దానికి సంబంధించి ఆధారాలన్నీ చూపుతూ అధికారులకు దరఖాస్తు చేయాలి. అప్పుడు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి వాస్తవంగా భూమి ఆరైతుదే అయితే వెంటనే రికార్డుల్లో సంబంధిత రైతు పేరుపై భూమిని నమోదు చేస్తారు.

సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్‌కార్డులతో విన్నపం


పోస్టుకార్డులతో ఫౌండేషన్ సభ్యులు

రఘునాథపాలెం: ధరణిని వెంటనే మార్చాలని, అందుకు అడ్డు పడుతున్న సీసీఎల్ఏ నవీన్ మిట్టల్‌ను మార్చాలని మండల కేంద్రంలో సాదిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి పోస్టుకార్డులతో విన్నవించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో అనేక అవకతవకలు చేసి ధరణి విషయంలో అనేక విధాలుగా ప్రజలను ఇబ్బంది పెట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి, సీసీఎల్ఏగా పనిచేస్తున్న నవీన్ మిట్టల్ ఇంకా అదే పదవిలో కొనసాగడంతో ధరణిలో అతడే అడ్డంకిగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ అబ్దుల్ రహిమాన్, పెళ్లూరి విజయ్ కుమార్, బాణోత్ భద్రునాయక్, అడ్వకేట్ షేక్ నజమా, డాక్టర్ ఖిజరుల్లా, బి ఉపేంద్రబాయ్, దామల్ల జయ, గన్నోజు గోవిందమ్మ, దేవ్వళ్ల నాగేశ్వర్, ఖైసర్ రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రఘునాథపాలెం ఏఈ ఇందిర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట 11కేవీ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. రామన్నపేట, కామంచికల్, ముత్యాలగూడెం, పడమడితండా, జాన్‌బాద్‌తండా గ్రామాల్లోని వినియోగదారులు గమనించాలని పేర్కొన్నారు.

తలసేమియా చిన్నారులకు అండగా..


మందులు అందజేస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మొదటి నుంచి పోలీసులు అండగా నిలుస్తూ వస్తున్నారని, వారికి తమ శాఖ ద్వారా అన్ని విధాల సహాయ సాకారాలు అందిస్తామని ఖమ్మం టౌన్ ఏసీపీ ఎస్.వి.రమణమూర్తి అన్నారు. ఆదివారం సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయం వద్ద రక్తదాతలు, రక్తదాన శిబిరాలు నిర్వహించే వారిని సన్మానించి, చిన్నారులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. ఏసీపీని రక్తదాతలు సత్కరించి, చిన్నారులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... పోలీస్ శాఖతో తలసేమియా చిన్నారులకు గతంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని, భవిష్యత్‌లో కూడా వారికి రక్తం కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. వందలాది మంది చిన్నారులకు రక్తం, మందులు కొరత లేకుండా అందజేస్తున్న సంకల్ప స్వచ్ఛంద సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. ఈ మేరకు తెలంగాణ అమెరిక తెలుగు అసోసియేషన్ (టాటా) ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ కన్నారపు ప్రసాద్ ఈ నెల చిన్నారుల మందులకు అసోసియేషన్ తరుపున సంకల్ప సంస్థకు రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. రక్తదాతలు బోస్ యాదవ్, కాంగ్రెస్ యువజన సంఘం నాయకులు జె.అంజని, జి.సతీష్, జి.నాగరాజు, తదితరులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణ మూర్తి, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, పి.రవిచందర్, పి.అనిత, పి.ఉదయ్‌భాస్కర్, బి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిమందిర వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్ రోడ్ విజయ్‌నగర్ కాలనీ ఉన్న శ్రీ షిరిడీ సాయిబాబా మందిరం సప్తదశ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక హారతులు, మంగళ తోరణాలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న బాబాను భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మందిర చైర్మన్ ఫణిభట్ల రాజలింగయ్య, వైస్ చైర్మన్ బుద్దా రామకృష్ణ, కార్యదర్శి పెంట్యాల వెంకటనర్సమ్మ, సహాయ కార్యదర్శి చంద్ర వీరభద్రరావు, కోశాధికారి కవులూరి అప్పారావు, సభ్యులు మండపూడి కృష్ణయ్య దొడ్డ నరసింహారావు, భూక్యా భిక్షపతి, కార్పొరేటర్ మచ్చ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతలకు జలాభిషేకం


జలాభిషేకం చేస్తున్న రైతులు

కామేపల్లి: మండలంలోని తాళ్లగూడెం గ్రామ రైతులు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని బొడ్రాయి, ముత్యాలమ్మతల్లికి ఆదివారం జలాభిషేకాలు నిర్వహించారు. నల్లమోతు చిన్న కోటయ్య, నాగేశ్వరరావు, నరేష్, పుచ్చకాయల ప్రభాకర్, అంగడాల అనంతరాములు, కొమ్మిన బోయిన రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ప్రజావాణి

కామేపల్లి: మండలంలోని కొత్తలింగాల విద్యుత్ రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామేపల్లి, కారేపల్లి మండలాల్లో విద్యుత్ వినియోగదారులు ఎలాంటి సమస్యలున్నా కొత్తలింగాల సబ్ స్టేషన్‌లో దరఖాస్తులను అందించాలని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యల పరిష్కారం చేసే దిశగా ప్రభుత్వం విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు 1984–87వ బ్యాచ్ బీఎస్సీ, బీజెడ్‌సీ తెలుగు మీడియం విద్యార్థులు ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 37 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రబృందం మధుర స్మృతులను నెమరవేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సత్యనారాయణ రెడ్డి, బండి గణేష్, కరుణాకర్ రెడ్డి, కేవీ కృష్ణారావు, బుజ్జిమల్ల వెంకటేష్, నిమ్మల శ్రీనివాస్, టి.ఉపేందర్ రెడ్డి, గంగాధర్, రామానుజం, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని పరామర్శించిన హరీష్‌రావు


మధుసూదన్‌ను పరామర్శిస్తున్న హరీష్‌రావు

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌ను మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు పరామర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వాటర్స్‌లోని తాత మధుసూదన్ నివాసానికి వెళ్లి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. హరీష్‌రావు వెంట ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పద్మ మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న పోటు రంగారావు

ఖమ్మంరూరల్: పీఓడబ్ల్యూ నాయకురాలు పద్మ మృతి చెందడం పార్టీకి, మహిళా సంఘానికి తీరని లోటని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. ఆదివారం పద్మ కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పద్మ ఆశయసాధనకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా, మద్యపానం వ్యతిరేక ఉద్యమంలో పద్మ పాత్ర మరువలేనిదని తెలిపారు. నివాళులర్పించిన వారిలో నాయకులు బండెల వెంకయ్య, గోకినెపల్లి వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, మనోహర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

28న జాబ్‌మేళా..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎంఎస్ఎన్ ల్యాబ్స్‌లో టెక్నికల్ ట్రెయినీ సెలక్షన్లకు ఈ నెల 28న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ లేదంటే ఒకేషనల్ విద్యార్థులైతే ఎంఎల్‌టీ బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాకు అర్హులన్నారు. అదే విధంగా ఇంటర్ 2023, 2024లో ఉత్తీర్ణులై 20 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని, పదో తరగతిలో కనీసం 60శాతం మార్కులు, ఇంటర్‌లో కనీసం 55 మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. కెమిస్ట్రీ, ఆంగ్లం బేసిక్స్‌పై రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఉంటుందని, ఇందులో ఎంపికైన విద్యార్థులకు బీఎస్సీ డిగ్రీ చదివిస్తూ, టెక్నికల్ ట్రెనింగ్ ఇస్తారన్నారు. ట్రెనింగ్ పిరియడ్‌లో నెలకు రూ.11 వేల స్కాలర్‌షిప్, ఉచిత వసతితో పాటుగా కంపెనీకి ఉచిత ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పిస్తారన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు టెన్త్ మెమో, ఇంటర్ మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాల్సి ఉంటుందన్నారు.

కార్మిక హక్కుల సాధనకు పోరాటాలు


మాట్లాడుతున్న రాయల రవికుమార్

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికుల హక్కుల కోసం ఐఎఫ్‌టీయూ నిరంతరాయంగా పోరాడుతుందని, రైతాంగ ఉద్యమస్ఫూర్తితో మరిన్ని పోరాటాలు చేయాలని టీపీటీఎఫ్ నాయకులు రాయల రవికుమార్ పిలుపునిచ్చారు. ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఖమ్మం ఏరియా 5వ మహాసభ ములకలపల్లి లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభల్లో రవికుమార్ మాట్లాడుతూ.. యాజమాన్యాల నిరంకుశ చర్యలను వ్యతిరేకించాలన్నారు. మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లు తీసుకొచ్చేందుకు కుట్రలు చేసిందని, పోరాటాలతో ఆ కుట్రలను తిప్పికొట్టాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య మాట్లాడుతూ... అసంఘటిత రంగంలో ఉన్న కార్మిక వర్గానికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని, వారికి సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ సభలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఆవుల అశోక్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నాయకులు శ్రీనివాస్, ధరావత్ సక్రు, పేరబోయిన వెంకన్న, బొమ్మకంటి రమేష్, జలగం రాంబాబు, అమర్లపూడి అప్పారావు, కిన్నెర నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 28న జనరల్ బాడీ సమావేశం


మాట్లాడుతున్న పుల్లంరాజు

ఖమ్మం అర్బన్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జనరల్ బాడీ సమావేశాన్ని జూలై 28న ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సభ రాష్ట్ర కార్యదర్శి టీవీ.పుల్లంరాజు తెలిపారు. ఆదివారం నగరంలోని గోపాలపురంలో జరిగిన సమావేశం సభ రాష్ట్ర అధ్యక్షుడు బేతి తిరుమల్ రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లంరాజు మాట్లాడుతూ.. ఏబీఏపీ జాతీయ అధ్యక్షులు కె.అయ్యప్ప దాస్ ఆదేశానుసారం 27న తెలంగాణ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం, 2024– 2026 సంవత్సరాల గాను నూతన కమిటీ ఎన్నిక, 28న జాతీయ జనరల్ బాడీ సమావేశం ఖమ్మంలో నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి జాతీయ కమిటీ సభ్యులు, ఐదు రాష్ట్ర కమిటీల సభ్యులు ఐదు రాష్ట్రాలలోని అన్ని జిల్లా కమిటీల సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్షుడు కార్యదర్శులు కోశాధికారులు హాజరయ్యారు.

కవాతును జయప్రదం చేయండి

ఖమ్మంరూరల్: వరంగల్ నగరంలో జూలై7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మగౌరవ కవాతు ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్డులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎస్సీ రిజర్వేషన్ ఉద్యమానికి 30 ఏళ్ల అవుతున్నందున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బి. కృష్ణ, సిహెచ్. రాంబాబు, అనిల్, భాస్కర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆనందరావు

నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ నాయకులు, ప్రముఖ వైద్యులు శీలం పాపారావు తండ్రి శీలం రామచంద్రయ్య మృతిచెందగా ఆదివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించి దశదిన కార్యక్రమంలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ అంబేడ్కర్ ప్రజా సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు లింగాల రవికుమార్, గొంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ కేవీ.కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సన్నె ఉదయ్ ప్రతాప్, నాయకులు రేఖ వెంకట సత్యనారాయణ యాదవ్, లక్ష్మినారాయణ, రవిరాథోడ్ శ్రీదేవి, నాగేశ్వరరావు, పెరుగు వెంకటరమణ, శ్రీనివాసరావు, జానకిరాములు, హనుమంతరావు, అనంతరాములు,వెంకటేశ్వర్లు, భద్రూనాయక్, ఉపేంద్రబాయి, నజీమా, రవి, శ్రీనివాస్ నాయక్, వీరన్ననాయక్, బాలు, జ్యోతి, రెహమాన్, జయ, స్పందన, ఝాన్సీ, నాగభూషణం పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కాల్వొడ్డు శ్రీ సత్య నారాయణ సహిత వీరాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణం, శ్రీ రమా సత్యనారాయణ స్వామి వార్ల తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వీరాంజనేయ స్వామి, శ్రీ సీతారామచంద్ర స్వామి వార్ల వార్షిక పవిత్రోత్సవ సహిత బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ నర్సింహారావు పర్యవేక్షణలో ఉప ప్రధాన అర్చకులు ఎస్‌బీ.కృష్ణమాచార్యులు, అర్చకులు కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పాల్గొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.